# వర్షించిన మేఘం

"ఆ అమ్మాయి పేరు స్వర్ణలత!

చక్కని పేరు! పేరుకు తగ్గ రూపం. పసిడికి పరిమళం లాగా రూపానికి తగిన విద్య, విద్యకు తగినట్టుగా వివేకం. ఇంకేమికావాలి? అసలే బంగారుతీగె. ఆ తీవెనిండుకూ విద్య, వినయం, వివేకం లాంటి పుష్ప గుచ్ఛాలు...

కథ చెబుతున్న వ్యక్తి పేరు శేషాద్రి. మనిషి నల్లగా, పొడుగ్గా వుంటాడు. వయస్సు నలభైకి తక్కువుండదు. అతడు యన్.జి.ఓ. క్లబ్బులో కొత్తగా చేరిన మెంబరు. పాతికేళ్ళ వయస్సులో మిలిటిరీలో చేరి స్థిర నివాసమంటూ ఒకటి లేక గుడారాల్లో కాలం గడిపినవాడు. పెళ్ళి చేసుకోవాలన్న వుద్దేశం వుండినప్పటికీ, చేసుకునే వెసులుబాటు లేకపోయిందేమో. అతడు ఏకాకి, ఇంకా పది పదిహేనేళ్ళు సైన్యంలో సర్వీసు చేసి వుండే వాడేగాని, ఇంతలో అతడేదో తీవ్రమైన జబ్బుకు లోనయ్యాడు. అయిదారు మాసాలు రోగశయ్యపైన వుండి పోవలసి వచ్చింది. డాక్టర్లు బ్రహ్మ ప్రయత్నంతో అతణ్ణి బ్రతికించారు. బ్రతకడమైతే బ్రతికేడుగానీ, అతడిక సైనికోద్యోగానికి అనర్హుడయ్యాడు. తిరిగి వచ్చి ప్రస్తుతం ఏదో ఆఫీసులో అటెండరుగా పనిచేస్తున్నాడు.

బాగా చీకటి పడిన తర్వాత వచ్చిన లేత వెన్నెల క్రమ క్రమంగా చిక్కబడుతోంది. క్లబ్బు వెనుక రావిచెట్టు క్రింది వెలుగు నీడల్లో నలుగురైదుగురు మిత్రులు చెట్టు బోదెకు చేరగిలబడి తోచినకాడికే బాతాఖానీలోకి దిగారు. 'సహృదయత' అన్న విషయంపైన చర్చ ప్రారంభమైంది. చర్చకు అడ్డు తగిలి "నేనొక అనుభవం చెబుతాను" అన్నాడు శేషాద్రి.

మిత్రులు చెప్పమన్నారు.

"ఆమెను నేను మొట్టమొదట చూచింది నడిరోడ్డులో..." చెప్పుకు పోతున్నాడు శేషాద్రి. "అప్పటికి నేనింకా మిలిటరీలో చేరలేదు. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తూ ఆఫీసుల వెంట తిరుగుతున్నాను. ఆ రోజు సాయంత్రం రోడ్డులో రద్దీ ఎక్కువగా వుంది.

అందులోనూ అది నాలుగు రోడ్ల కూడలి. బస్సులు, లారీలు, రిక్షాలు, సైకిళ్ళూ నిలుపూ నిమందరం లేకుండా పరుగెత్తుతున్నాయి! వాటికి మధ్య మనుషులు త్రోవ చేసుకుని ప్రాణాల్ని గుప్పిట్లో వుంచుకొని రంయి రంయి మని అటూ యిటూ పారిపోతున్నారు. అది తీరిగ్గా చూస్తూ నిల్చోదగ్గ వినోదమే! కాని నేను వెళ్తున్నది తొందర పనిమీద రోడ్డును క్రాస్ చేయబోతూ ఓ క్షణం ఆగి ముందుకు చూశాను. అలా చూచినప్పుడే – నా కళ్ళకు స్వర్ణలత కనిపించింది.

క్రాస్ చేసే విధాయకం ఆమె కంతగా తెలిసినట్లు లేదు, లేకపోతే ఆ గందరగోళంలో తోచింది గాదేమో! ఆమె రోడ్డు మధ్య, అడుగు ముందుకు వేయడానికి వుంకిస్తూ, అంతలో ధైర్యం చాలక బిక్కరించి చూస్తూ వుంది.

రోడ్డులో ఎంతసేపని తటపటాయించడానికి వీలుంటుంది? వేద్దామా వద్దా అనుకుంటూ ఆమె అడుగు ముందుకు వేసిందో లేదో – బాణంలా వస్తున్న సైకిలొకటి ఆమెను దూసుకుంటూ వెళ్లింది. ఆ వెళ్లడంలో స్వర్ణలత చీర చెరగు హాండిల్ బారుకు తగులుకుంది. పరతెంచి పోతున్న వురవడిలో సైకిలు వాలా ఎలాగో క్రింద పడకుండా తప్పించుకొని కళ్లు మూసి తెరచేలోగా జనంలో పడి అదృశ్యుడై పోయాడు. స్వర్ణలత మాత్రం తారు రోడ్డుపైన బోరగిల పడిపోయింది.

రోడ్డు మీద ఆమె పడిపోయింది, ఆమెకు ఏడెనిమిది గజాల దూరంలో కారొకటి శరవేగంతో పరుగెత్తుకొస్తోంది.

చెప్పడాని కింతసేపు పట్టింది గానీ, ఈ సంఘటనంతా క్షణంలో జరిగిపోయింది.

నాకు తెలిసిందే! మరుక్షణాన నేనేం చేశానో నాకు తెలియదు. బహుశా ముందుకి దూకి వుంటాను. కారు కడ్డంగా పడివున్న స్వర్ణలతను ఇవతలకి లాగివేయడానికి ప్రయత్నించి వుంటాను. కానీ ఈ ప్రయత్నంలో నేను కృతకృత్యుణి కాలేక పోయాను. నా ప్రయత్నం వల్ల స్వర్ణలతకు చావు తప్పింది గానీ, అపాయం మాత్రం తప్పలేదు.

కారు స్వర్ణలత కుడికాలు పాదంమీదుగా వెళ్లిపోయింది. ఆ పాదం పాదమంతా నుజ్జుగుజ్జయి పోయింది. ఎర్రటి రక్తం నున్నటి తారు రోడ్డుపైన జర్రున జారిపోతుంది. స్వర్ణలత నోట తేమ లేదు. శరీరం పైన స్పృహలేదు.

కూడలిలోని రక్షక భటుడు కారును మాత్రం పారిపోకుండా నిలుపగలిగేడు.

'ఎవరీమె, ఎవరీమె అంటూ జనం చుట్టూ ప్రోగైపోయారు. చివరి కామెకు వూపిరికూడ ఆడడానికి వీల్లేనంత దగ్గరగా వచ్చేశారు. వాళ్లని దూరంగా తోయడంలో నాకు రక్షక భటుడు సాయపడ్డాడు.

ఆ కారులో డ్రయివరొకడు తప్పితే స్వంతగాళ్ళెవరూ లేరు. అతడు తన ఉద్యోగం ఎక్కడ వూడుతుందో నని హడలిపోతున్నాడు. రక్షక భటుని ధ్యాసంతా ఆ డ్రయివరు మీద చర్య తీసుకోవడం పైనేవుంది.

డ్రయివరు పైన చర్య తీసుకోడంకన్నా, ఆమె ఎవరో తెలుసుకోడం కన్నా, గాయానికి కట్టు గట్టి చికిత్స చేయడం అత్యవసరమని సూచించాను.

అందరూ ఔనన్నారు.

ఆ కారులోనే ఆమెను దగ్గర్లో వున్న డాక్టరుగారి దగ్గరకు తీసుకెళ్ళాను. డాక్టరుగారు సమయానికి అదుకున్నారు. అయిదు నిముషాల్లో కట్టుగట్టి ముగించారు, ఆ లోపల నేను హోటలుకు వెళ్ళి కాఫీ తీసుకొచ్చాను. వేడి వేడిగా కాఫీ గొంతుక వెంట దిగేసరికి ఆమె ముఖాన గుప్పున చెమట పట్టింది. కట్టెలా పడివుండిన మనిషిలో కదలిక పుట్టింది. ఆమె కళ్ళు తెరచి నావైపు చూచింది.

అందాకా సంచారానికి వెళ్ళిన నా ప్రాణం ఆమె తేరుకోగానే తిరిగి వచ్చి తన గూటిలో తాను చేరుకున్నట్టయింది.

"బాధగా వుందా?" అని ప్రశ్నించాను. అవునన్నట్లు ఆమె తల వూపింది.

"అడ్రసు చెప్పండి, మీ వాళ్లను పిలువ నంపుతాను" అన్నాను.

ఆమె మెల్లగా చిరునామా చెప్పగలిగింది. విషయం ముక్తసరిగా వ్రాసి, చీటీని కుర్రవాడి ద్వారా ఆ అమ్మాయి తండ్రిగారికి పంపించాను.

అర గంట గడచి గడవక ముందే పక్షుల్లా వచ్చి వాలిపోయారు శివకామయ్య దంపతులు. శివకామయ్యగారు పట్టణంలో బాగా గడిస్తున్న లాయరు. ధారా ప్రవాహంగా మాట్లాడ గలగడం ఆయనకు దేవుడిచ్చిన వరం. సాధారణంగా గుండె నీరైపోయే దుఃఖ సమయాల్లో కొందరికి నోటమాట రాకపోవడం కద్దు. కానీ శివకామయ్య గారి సంగతి వేరు. సంతోషం, సంతాపం, దయా, కోపం – ఏ భావాన్నయినా సరే మాటలోకి తర్జుమా చేసి గడగడా ఉపన్యసించివేయడం ఆయన స్వభావం. "ఏమైంది డాక్టర్! ఏమైంది? ఎలా పడిపోయింది? ఎందుకు పడిపోయింది? అప్పటికి నేను నెత్తిన నోరు బెట్టుకొని చెబుతుండే వాడిని. 'అమ్మాయీ! నీకు జాగ్రత్త తక్కువ! తోటలో పచారు చేసినట్టుగా రోడ్డులో నడవగూడదు" డాక్టరుగారితో ఇలా మాట్లాడుతూ ఆయన గదిలో ప్రవేశించారు.

కుమార్తెను పడక మీద చూడగానే శివకామయ్య గారి భార్యకు నడుము విరిగినట్టయింది. 'ఎలా వుందమ్మా ఎలా వుంది?' అంటూ ఆమె మంచంపైకి వ్రాలిపోయింది.

డాక్టరుగారు శివకామయ్య గారిని గది బయటికి తీసుకెళ్ళి "గాయానికి కట్టు కట్టాను. జ్వరం, గిరం రాకుండా ఇంజక్షను కూడా వేయబోతున్నాను. మీ రామెను తొందర పెట్టకండి. ఆమె అలాగే విశ్రాంతి తీసుకోవడం అవసరం" అన్నాడు.

గంట ఎనిమిదైంది. నేనింకా తామసించడానికి వీల్లేదు. శివకామయ్యగారి దగ్గర సెలవుతీసుకొని ఇంటికి బయల్దేరాను.

"నీ మూలంగా మా అమ్మాయిని ఈ విధంగా నైనా కళ్ల జూడ గలిగాను. చేసిన మేలును మరిచిపోయే దుర్గుణం మా వంశంలో లేదు! అప్పుడప్పుడూ వచ్చి పోతూ వుండు. నీ కెప్పుడు ఏ సహాయం కావలసి వచ్చినా, వచ్చి నన్ను కలుసుకో" అన్నారు శివకామయ్యగారు.

స్వర్ణలత రెండు మూడు వారాలు పడకపైన వుండి పోయింది, నే నామెను చూడడానికి నాలుగైదుసార్లు వెళ్ళి వుంటాను. వెళ్లిన ప్రతిసారీ నే నామె సౌజన్యానికి ముగ్ధుడనవుతూ వచ్చాను. ఈ నవనాగరిక సమాజాల్లో ఒక మనిషి మరొక మనిషితో మాట్లాడుతున్నప్పుడు - అందులోనూ రెండో వ్యక్తి కొన్ని మెట్లు క్రింది వాడైనపుడు మొదటి వ్యక్తి మాటిమాటికి తన అంతస్థును, అభిరుచినీ మననం చేసుకోకుండా వుండలేదు. స్వర్ణలతకు అలాటి పట్టింపులు లేవు. స్వచ్ఛమైన అమాయకత్వం, అభినయంతో కలుషితంగాని సహృదయత ఎవరి శీలానికైతే ప్రాతిపదికగా వుంటాయో వాళ్ళు తమకూ ఎదుటివాళ్ళకూ మధ్య కృత్రిమపు అడ్డుగోడలను సృష్టించుకోలేరు.

స్వర్ణలతను గురించిన వివరాలు ఆమె మూలంగానే తెలిశాయి. ఆమె స్కూల్ ఫైనల్ చదువుతోంది. ప్యాసవగానే కాలేజీలో చేరుతుంది. బి.యే. వరకూ చదువుకోవాలని ఆమె సంకల్పం. కానీ తల్లి తండ్రులకు అంతవరకూ చదివించాలన్న ఉద్దేశం లేదు. ఆ లోపలే చదువు మానిపించి... ఆ పైన సిగ్గు బరువుతో ఆమె మాట్లాడలేక పోయింది.

◆ ◆ ◆

చెట్టు మొదలుకు చేరగిల పడివున్న శేషాద్రి లేచి కూర్చుని సిగరెట్టు ముట్టించాడు.

"ఇదేం ముసుగులో గుద్దులాటయ్యా శేషాద్రి! మేమింకా ఇదేదో ప్రణయ గాథ కాబోలు ననుకున్నాము. అవునో కాదో తేల్చి చెప్పేయకూడదు?" అన్నాడొక మిత్రుడు.

"దీన్నెవరైతే ప్రణయ గాథ అని భావించారో, వాళ్ల సహృదయతని నేను శంకిస్తున్నాను" అన్నాడు లీలగా నవ్వేస్తూ శేషాద్రి.

"ఎందుకూ? ఎందుకూ?" అందరూ ఏక కంఠంతో ప్రశ్నించారు.

"రాజ కుమారి తోటమాలిని పెళ్లాడడానికి ఇది జానపద గాథ కాదు. ప్రథమ పరిచయంలోనే ప్రణయానికి అంకురార్పణ జరగడమనేది లోకంలో అరుదుగాను, కథల్లో తరుచుగానూ జరిగే సంఘటన. పైగా దారంట వెళ్లే దానయ్యను టకీమని ప్రేమించడానికి స్వర్ణలత అంత మూఢురాలు గాదు. తన అంద చందాలకు, విద్యా వివేకాలకూ సరిపోగల వరుణ్ణి తల్లిదండ్రులు ఎన్నుకొనేదాకా ప్రణయ జీవితాన్ని వాయిదా వేసుకోగల ఓపికా, సంస్కారమూ ఆమె కున్నాయి. మీ రనవచ్చు 'ప్రేమ గుడ్డిది' అనీ! ఎంత గుడ్డిదైనా అది ఒళ్లెరుగని శివం మాత్రం కాగూడదు!"

"అదేమిటి శేషాద్రి! ఇప్పుడు మేము స్వర్ణలతకు ఏదో పెద్ద అపచారం సలిపినట్టు ఫీలయిపోతా వెందుకూ!" అన్నాడొక మిత్రుడు.

"గుమ్మిడికాయ దొంగ అనక మునుపే భుజాలు తడువుకుంటున్నావేం శేషాద్రి! మేము నీకంటే ముందుగా నీ సహృదయతని శంకిస్తున్నాం" అన్నాడు మరొక మిత్రుడు.

శేషాద్రి ఈసారి మరీ తేలిగ్గా నవ్వేస్తూ "వాగ్వాదం చాలు! శ్రోతలు కథకుణ్ణి అపార్థం చేసుకోగూడదని కాస్త తీవ్రంగా హెచ్చరించాను" అని మళ్ళీ కథలోకి వచ్చాడు.

"స్వర్ణలత కాలేజీలో చేరింది. నాకూ ఒక చిన్న ఉద్యోగం దొరికింది. పండుగా పబ్బమూ వచ్చినప్పుడు ఆమె గుమస్తా ద్వారా నాకు కబురు పెట్టేది. విస్తరి నిండుకూ ఫలహారాలు వడ్డించి తల్లీ కూతుళ్లిద్దరూ నా ఎట్ట ఎదుట కూర్చునేవారు. ఆకొన్న ప్రాణికి తినుబండారలను మటుమాయం చేస్తుంటే చూస్తూ కూచోడం వాళ్ళిద్దరికీ ఓసరదానేమో! ఆ మాటే వాళ్లతో చెప్పేవాణ్ణి "అప్పుడేమయింది శేషాద్రన్నయా! నువ్వు త్వరగా పెళ్ళి చేసుకో! వదినకూ నీకూ ఈటింగ్ రేస్ ఏర్పాటు చేస్తాను" అనేది స్వర్ణలత.

కానీ జీవితపు రన్నింగ్ రేసులో ఎవరు ముందుకు పోగలరో ఎవరు వెనుకపడగలరో అడుగు సాగక ఎవరు చతికిలబడగలరో వూహించడం ఎవరితరం? నా కీనాటికీ పెళ్లి కాలేదు. ఇంటర్మిడియట్ పూర్తి కాగానే స్వర్ణలత పెళ్లయింది. ఆ పెళ్ళి జరిగినప్పుడు నేను వూళ్ళోలేను. నేనుద్యోగం చేస్తున్న వర్తక సంస్థ పనిమీద కుంకుడు కాయలు కొనడానికి కోజికోడుకు వెళ్ళిపోయాను. తిరిగి వచ్చేసరికి స్వర్ణలతకు పెళ్లి జరిగిందనీ, ఆమె భర్తతో కాపురానికి వెళ్ళిపోయిందనీ తెలిసింది.

స్వర్ణలతను పెళ్లి పీటలపైన చూడాలని నా కెంతైనా కుతూహలముండేది. నా కన్నదమ్ముల్లేరు. అక్క చెల్లెళ్లు లేరు. ముసలి తల్లి తప్పితే నా అన్న వాళ్ళెవరూ లేరు. అనగా ముందుబడి నన్ను పెళ్ళికొడుకును చేయడానికి సిద్ధపడే వాళ్లెవరూ లేరన్నమాట! పోనీ వాళ్ళ పెళ్ళిళ్ళకు నన్ను అప్యాయంగా ఆహ్వానించే వారుమాత్రం ఎవరున్నారు

గనుక! చివరకు స్వర్ణలత పెళ్ళి కూడా చూడలేకపోయాను. ఆమెకు పెళ్ళయిన క్రొత్తలో ఈ ఆవేదన నా హృదయంలో గింగుర్లు తిరిగేది! కానీ ఆ అసంతృప్తిలో గూడా ఓ సంతృప్తి. ఎలాగైతేనేం, స్వర్ణలతకు దొరికింది చాలా మంచి సంబంధం. భర్త కేంద్ర ప్రభుత్వం సెక్రటేరియేట్‌లో యు.డి.సి.గా పనిచేస్తున్నాడు. పనిచేసిన కొద్దీ ప్రమోషనులు దొరికే వుద్యోగం. స్వర్ణలత జీవితం సుఖశాంతులతో సాఫీగా దొర్లిపోవచ్చు...

వర్తక సంస్థలో నేను పూర్తిగా వుద్యోగం చేసింది నాలుగేళ్ళు. అయిదో యేడు జరుగుతుండగా మా అమ్మ చనిపోయింది. విరక్తితో వుద్యోగానికి రాజీనామా పెట్టి మిలిటరీలో చేరిపోయాను.

రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచిపోయాయి. ఒకే రకమైన బ్రతుకు, కొండలూ, కోనలూ – రకరకాల మనుషులు, చిత్ర విచిత్రంగా వినిపించే భాషలు, వింత వింత ఆచారాలు. ఒక మహాసముద్రంలో చిరుచేపలా రోజులు వెళ్ళబుచ్చాను. ఆ పటాలానికంతా జాబులు రాని వాణ్ణి, రాయనివాణ్ణి నేనొక్కడినే నేమో! అప్పుడప్పుడూ నేనెందుకు జీవిస్తున్నానని నన్ను నేనే ప్రశ్నించుకొనేవాణ్ణి. తినడానికీ, దేశంపైన ద్రిమ్మరడానికీ, కంటి నిండా కునుకు తీయడానికేనా బ్రతకడం? నాకప్పుడొక జీవిత రహస్యం తేట తెల్లమైయింది, మనిషి యితరులకోసం బ్రతకడంలోనే ఆనందముందని. తనకోసమే తాను బ్రతకడంలో ఆనందం లేదు సరిగదా, అలాటి వాడికి ఎదురయ్యేవి అనంతమైన ఆవేదన, అసంతృప్తీ మాత్రమే!

పది పదిహేనేళ్ళు అలా సర్వీసు చేశాను. పటాలం కాశ్మీరులో వుండగా పొడిపొడిగా దగ్గు ప్రారంభమయింది. డాక్టర్లు పరీక్షచేసి విపరీతమైన ధూమపానం వల్ల వూపిరి తిత్తులు చెడిపోయాయనీ, రెండు తిత్తులలో ఒక తిత్తిని పూర్తిగా తీసివేయకపోతే మొదటికే మోసం రావచ్చుననీ చెప్పారు. పై అధికారులు సెలవిప్పించి, చికిత్సకోసం ఢిల్లీలోని ప్రభుత్వ వైద్యశాలకు పంపివేశారు.

అది అపాయకరమైన ఆపరేషన్, ఈగట్టో ఆగట్టో నిర్ధారణగా చెప్పడానికి వీల్లేదు. అయినా నేనందుకు చింతించలేదు. ఆపరేషనుకు సిద్ధపడ్డాను. ఆ తతంగం పూర్తి అయి నాకు స్మృతివచ్చేసరికి తేదీలు కాలెండరులో యిరవై కాగితపు ముక్కలు చిరిగిపోయాయి. ఇంకా మూడు నెలల వరకూ పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలన్నారు డాక్టర్లు. అలాంటిలాంటి విశ్రాంతి కాదు. పడకపై నుంచి దిగకూడదు. దిగినా పదిబారల దూరం నడవకూడదు!

ఓ రోజు ఉదయం నేను తలగడ కానుకుని పేపరు చదువుకుంటున్నాను. అది పొడుగాటిహాలు, వరుసగా మంచాలున్నాయి. మనుషులు వస్తుంటారు పోతుంటారు. కానీ నా కోసం మాత్రం కాదు. కనీసం అక్కడ ఓ తెలుగుమాటైనా వినిపించదు.

పేపరు చదువుతూ నేను ఉలికిపడ్డాను. హాలులో ఎవరోగానీ అచ్చమైన తెలుగులో మాట్లాడేస్తున్నారు.

చేతిలోని పేపరు క్రిందికి జారిపోయింది. అప్రయత్నంగా నా కళ్ళు ఆవైపుకు తిరిగాయి. ఆ క్షణం నాకళ్లను నేను నమ్మలేకపోయాను. కల కాదుగదా! భ్రమ కాదుకదా! కాదు. ముమ్మాటికీ కాదు. ఆమె ముమ్మార్తులా స్వర్ణలత! ఏళ్ళు పదిహేను గడిచినా నేనామెను ఇట్టే పోల్చుకో గలిగాను.

ఆమె ఒంటరిగాలేదు. ప్రక్కనే మరో కుర్చీలో ఆమె భర్త కూర్చున్నారు. ఇద్దరూ చెరొక బిడ్డను ఒడిలో కూచోబెట్టుకుని మంచంపైన పడుకున్న రోగిని పరామర్శిస్తున్నారు.

ఆ సంభ్రమంలో దగ్గరగా వెళ్లి ఆమెను పలకరించాలనుకున్నాను. కానీ నాకు నేనై ఆమెను పలకరించడం ఎబ్బెట్టుగా వుంటుందేమో! ఎలాగూ వాళ్ళు నా మంచానికి ప్రక్కగా ద్వారంవైపు వెళ్ళక తప్పదు. అప్పుడైనా స్వర్ణలత నన్ను చూడకపోదు.

కానీ అంతకుముందే కూర్చున్న తావులోనుంచీ స్వర్ణలత హఠాత్తుగా నన్ను చూసేసింది. ఏండ్లు గడిచినా నా ఆకారంలో పెద్ద మార్పేమిలేదు. దిగులులేని తిండి కావడం చేత పది పదిహేనేళ్ల సర్వీసులో నా ఒళ్ళు కాస్త నునుపు దేలిన మాట నిజమే! కానీ జబ్బు పడిన తర్వాత ఆ నునుపూ గినుపూ సమసిపోయి నేను మళ్ళీ మామూలు మనిషినై పోయాను. పదిహేనేళ్ళకు మునుపు ఎలావుండేవాడినో ఇవాళ అలాగేవున్నాను. పైగా ఆ క్రితంరోజు సాయంత్రమే ముఖం శుభ్రంగా గీక్కుని వున్నాను గూడా! స్వర్ణలత నన్ను గుర్తుపట్టి వుండదనడానికి ఆస్కారమే లేదు! ఏ క్షణానికాక్షణమే ఆమె లేచి నిలబడుతుందనీ, చరచరా మంచం దగ్గరకి వచ్చేస్తుందనీ భావించాను. కానీ అలాటిదేమీ జరుగలేదు. నిండుగా ఒక్క నిమిషంసేపు అనిమిష నయనాలతో నావైపు చూచింది. తరువాత తల దించుకుంది. అందించుకోవడం కూడా తాత్కాలికంగా మాత్రమే! మళ్లీ మళ్లీ ఆమె నావైపు చూడకుండా వుండలేకపోయింది.

అయిదు నిమిషాల్లో ఆ రోగిని పరామర్శించడం ముగిసింది. దంపతులు పైకి లేచారు. ద్వారంవైపు వస్తున్నారు. నా మంచాన్ని సమీపించారు... స్వర్ణలత పలుకరిస్తుంది నా బ్రతుకిలాగైపోయింది చెల్లీ అంటే ఆమె నాకోసం కన్నీరు విడుస్తుంది... అనుకున్నాను. కానీ స్వర్ణలత వంచిన తల పైకెత్త లేదు. ఎంతైనా ఆమెది ఆడ పుట్టుక. ఆడవాళ్లకు సహజంగా సంకోచం ఎక్కువ. పిలిచి నేనే ఆమెతో మాట్లాడాలని కూడా అనుకున్నాను. కానీ నా కలాటి అవకాశం సైతం లభించలేదు. తల వంచుకున్న స్వర్ణలత నావైపు తిరిగి మళ్ళీ చూడకుండా భర్త వెంట వెళ్ళిపోయింది.

నా అనువారి మమకారానికీ అభిమానానికీ నోచుకోక ఏళ్ళుగా పూండ్లుగా మొద్దుబారిపోయిన నా హృదయాన్ని దారుణాఘాతానికి గురిచేసి. మానవత్వం పైన నాకున్న నమ్మకాన్ని మూలమట్టంగా కదిలించి స్వర్ణలత నన్ను చూచిగూడా చూడనట్టు వెళ్ళిపోయింది.

నిర్లక్ష్యమా!

అహంకారమా?

గర్వమా?

ఆమెలోని అమాయకత్వమూ, సహృదయత ఏమయాయి? ఎలా మరచిపోగలిగింది స్వర్ణలత నన్ను? ఎలా మరచిపోగలిగింది తన ప్రాణదాతను?

మిత్రులు తలా ఒక అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

"మనిషిలోని సుగుణాలు కాలమనే మరు భూమిలో యింకిపోతాయి" అన్నాడు భావుకుడు ఆనందమూర్తి.

"అధికార రోగపూరిత బధిరాంధక శవాలురా బాబూ! స్వయంగా ఆమె కధికారం లేదనుకో. భర్త పెద్ద ఉద్యోగి కదా! అతని హోదాలో అర్ధాంగికి వాటా లేకుండా వుంటుందా?" అన్నాడు వాస్తవికవాది వేంకటేశం.

"లేవండి మరి! గంట తొమ్మిదైయింది" అన్నాడు కృష్ణారావు.

"కానీ నా కథ యింకా పూర్తికాలేదే!" అన్నాడు శేషాద్రి.

"చంపేశావు! ఆ కొరవగూడా కానివ్వుమరి!" అని వేగిరించాడు రాధాపతి.

ఆపూట గడచిపోయింది. ఆ రాత్రి గడిచిపోయింది. మరునాటి పగలు గూడా గడిచిపోయింది. సరిగ్గా ముప్పయి ఆరుగంటలన్న మాట! నా జీవితంలో నేనెప్పుడూ అలా బాధపడలేదు, కడకు మా అమ్మ చనిపోయినప్పుడు గూడా ముసలి వాళ్ళెంత కాలమని బ్రతుకుతారని వూరట చెందాను. కానీ యిప్పుడు? సహృదయత, అనుకంప, ఆత్మీయత, యివన్నీ దేనిలోనైతే అంతర్భాగాలో ఆ మానవత్వమే ఒక కల్ల బొల్లి కబురని తేలిపోయిన తర్వాత ఈ కటిక కసాయిలోకంలో నేనింకా సజీవంగా వుండడంలో అర్థం లేదనిపించింది. ఆపరేషన్ చేసినప్పుడే నేను చనిపోయి వుండవలసింది...

మసక చీకటి, ఆకాసాన మబ్బులు నడయాడుతున్నాయి. చిత్తడి చినుకులు ఉదయం నుంచీ రాలుతూనే ఉన్నాయి. ఈదురుగాలి ఒకటి, రోగులు దుప్పట్ల క్రింద ముడుచుకపోతున్న ఆ వేళప్పుడు వైద్యాలయం ప్రాంగణంలో ఒక టాక్సీ నిలచింది. అందులోంచి ముఖమంతా ముసుగులో దాచుకున్న ఓ యువతి దిగింది.

నేను వేడిగా నిట్టూర్చాను. అదృష్టవంతులకు బంధువులు, పరిచితులు, స్నేహితులు! దురదృష్టవంతుల కెవరున్నారు?

ఆ టాక్సీ దిగిన యువతి వరాండాలో నుంచీ ద్వారం దగ్గరకు వచ్చింది. ఒక్కసారి హాలంతా కలియ పరికించింది. ఆ తరువాత నేరుగా నా మంచం దగ్గరకు వచ్చేసింది.

ఇది గూడా కల గాదు!

ఇది గూడా భ్రమ గాదు!

ఆమె స్వర్ణలత!

"నన్ను మన్నిస్తావా అన్నయ్యా! ఈ నిర్భాగ్యురాల్ని మన్నించలేవా అన్నయ్యా!" అంటూ ఆమె మంచముపైన ఒక ఓరగా కూర్చుంది.

ఆమె వెంటనే లోపలికి వచ్చిన టాక్సీ డ్రయివరు ఓ బుట్ట నిండుకూ చీనీ పళ్లనూ, అరటి పళ్లనూ, మోపెడు పుస్తకాలనూ తీసుకొచ్చాడు.

"నీవు నన్ను అర్థం చేసుకోవా లన్నయ్యా? నేను ఆడదాన్ని - మొగవాణ్ణిగాను, అవమానకరమూ అమానుషమూ అయినప్పటికీ ఆడ దెప్పుడూ కొన్ని హద్దులకు లోబడవలసి వుంటుంది."

"ఇప్పుడు నీవల్ల ఏమంత తప్పిదం జరిగిపోయింది చెల్లీ!" తల వంచుకుని పడకపైన వ్రేలితో గీతలు గీస్తూ అన్నాను.

"నువ్వు నా మాటలను నమ్మగలవా అన్నయ్యా!" అంది స్వర్ణలత. "నిన్నటి నుంచీ నా కన్నం దిగలేదు. రాత్రి నిద్ర పట్టలేదు. ప్రతి శుక్రవారమూ ఈవేళప్పుడు నేను గుడికి వెళ్ళి రావడం మామూలు. అలాగే ఈవేళ కూడా వెళ్తున్నాని చెప్పి యిక్కడికి రాగలిగాను..."

"పోనీలే చెల్లీ! నువ్వు వచ్చావు. నాకదే చాలు. నేను ఏకాకిని, ఈ రోజు నువ్వు తప్పితే ఈ పదిహేనేళ్లలో నాకోసం వెదుక్కుంటూ వచ్చిన వాళ్లెవరూ లేరు..." అన్నాను.

బుట్టలో నుంచి పళ్లు తీసి ఒలిచి పెడ్తూ స్వర్ణలత నా జబ్బును గురించిన వివరాలను అడిగి తెలుసుకుంది.

అరగంటసేపలా గడచిపోయింది.

"నేను వెళ్ళొస్తానన్నయ్యా!" అంది స్వర్ణలత.

"వెళ్దువుగానీ కాసేపు కూచో చెల్లీ! ఇంతసేపు మాట్లాడావు గానీ బావమరదిని గురించి ఒక్కమాట గూడా చెప్పావుగావు..." అన్నాను.

"ఆయన మంచివారే" అంది స్వర్ణలత.

"అలాగా!" అన్నాను.

"నేనంటే తన కెంతో యిష్టం. మంచి ఖరీదైన చీరలు కొనిపెట్టారు. సినీమాలకు, పెద్ద పెద్ద విందులకు తీసుకెళ్లారు. కాదంటే ఎందుకో ఆయనకు అనుమానా లెక్కువ. అందుకు నా దురదృష్ట మొకటి తప్పితే మరొక కారణ మేదీ నా వూహ కందడంలేదు. ఒకసారి మా మేనత్త కొడుకు రవి ఢిల్లీ వచ్చాడు. వాడు నాకంటే రెండేళ్లు చిన్నవాడు. చిన్నప్పుడు మేము ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకున్నాము. వాడితో నేను చనువుగా మాట్లాడినందుకు ఈయన కోప్పడి నెల రోజులపాటు నాతో మాట్లాడ్డం మానేశారు..."

"మనిషన్న తర్వాత ఒకటి రెండు అవగుణాలుండక పోతాయా చెల్లీ! ఏం చేయగలం? సర్దుకుపోవాలి... వీలైతే ఎప్పుడైనా బిడ్డల్ని తీసుకురా" అన్నాను.

"అలాగే అన్నయ్యా!" అంటూ స్వర్ణలత సెలవు తీసుకుంది.

◆ ◆ ◆

"ఆ తరువాత నీకామె కనిపించలేదన్నమాట!" అన్నాడు వెంకటేశం.

"ఆ తరువాత ఆమె కనుపించడంగానీ, కనిపించకపోవడం గానీ ఈ కథకు సంబంధించినంత వరకూ అప్రస్తుతం. ఆ రోజు స్వర్ణలత వెళ్ళిపోయిన తర్వాత నేను ఎంతోసేపు ఆమె భర్తను గురించి ఆలోచిస్తూ కూర్చున్నాను. అతడామెకు మంచి చీరలు కొనిపెట్టాడు. సినీమాలకూ, విందులకూ తీసుకెళ్తాడు. కానీ ఆమె ఎవరితోనూ చనువుగా మాట్లాడగూడదు. వెనువెంట అంగరక్షకులు లేకుండా యిల్లు కదలకూడదు. అంటే ఏమిటి? అతడు తనచేతికి వేసుకున్న వుంగరాలనూ తన డాబు దర్పాలనూ ఎలాగైతే ప్రదర్శించుకుంటున్నాడో అలాగే భార్యను గూడా తన హోదాలో ఒక భాగంగా ప్రదర్శించుకుంటున్నాడన్న మాట! ఆ భార్య కూడా ఒక మనిషే నని, ఆమెకు గూడా ప్రత్యేకంగా కొన్ని అభిప్రాయాలూ, అభిరుచులూ వుంటాయని గుర్తించడానికి నిరాకరిస్తున్నాడన్న మాట.

ఏమైతేనేమి? ఈ విశాల ప్రపంచంలో నా కెక్కడో ఒక చెల్లెలు వుంది –" చరాలున లేచి నిల్చున్నాడు శేషాద్రి. "ఆమె హృదయపూర్వకంగా నా బాగును ఆకాంక్షిస్తుంది. నేను బొత్తిగా నా అన్న వాళ్ళు లేనివాణ్ణిగాను. నాకదే ఒక సంతృప్తి!" – క్రింద వేసుకున్న పై గుడ్డను విదిలించి భుజాన వేసుకుని తన బసను చేరుకోడానికి చరచరా నడవసాగాడు శేషాద్రి.

❀ ❀ ❀